# పేచీ తెచ్చిన వాచీ

స్కూలు మేష్టరుగా పని చేస్తున్న కేశవరావుకు ఒకే ఒక తమ్ముడు. అతని పేరు మాధవరావు. ఇద్దరిది ఒకే ఆలోచన, ఒకే పని, ఒకే చోటవుంటూ ఒకే స్కూల్లో విద్యాభ్యాసం కూడా చేశారు. ఎక్కడికి వెళ్లినా యిద్దరూ కలిసే వెళ్ళేవారు. యుద్ధ సమయంలో యిద్దరూ కలిసి ఒక్కమారుగా సైన్యంలో ప్రవేశించారు. అందులో సమానమైన పేరుప్రఖ్యాతులు సంపాదించారు. యుద్ధానంతరము తిరిగి యింటికి చేరుకున్న వీరిని చూచి ఆవూరి వారంతా వారి కండలు తిరిగిన దండలకు జవసత్వాలకు మురిసిపోతూ ఘనంగా చెప్పుకుంటూ వుండేవారు.

ఇంటికి వచ్చిన కొలదికాలానికే తండ్రి చనిపోయాడు. తండ్రి చాలా ఆస్తి సేకరించాడు కాని అది సమానంగా పంచుకోడానికి తగినట్లు లేదు. ఆ కారణంచేత సమానంగా విభజించుకునేపట్ల రాబోయే కలహాలు వూహించుకొని అట్లా రాకుండా వుండేటట్లు ఇద్దరూ ఒక ఆలోచన చేశారు.

ఆస్తి అంతా వేలం వెయ్యడానికి, ఎవరికి ఏది అవసరమైతే అది వేలంలో కొనుక్కోడానికి వేలంలో వచ్చిన సొమ్ము ఇరువురు సమానంగా పంచుకోడానికి నిశ్చయించుకున్నారు. ఆ ప్రకారంగానే జరిగింది కూడాను. అయినా తగూ మాత్రం రాకుండాపోలేదు. తండ్రి ఒక అమూల్యమైన బంగారపు వాచి సంపాదించాడు. దాని ఆకారానికి, పనితనానికి చాలాఘనంగా ఆ వూరివారంతా చెప్పుకునేవారు. అటువంటి వాచి అప్పట్లో ఆ చుట్టుపట్ల ఎవరివద్దా లేదు. ఈ వాచీ వేలం వెయ్యబోయేసరికి చాలామంది ధనవంతులు తయారయ్యారు కొనడానికి. కాని ఎప్పుడైతే అన్నదమ్ములే దానిని కొనడానికి నిశ్చయించుకొని మరొకరికి అవకాశం లేకుండా పాట పెంచడం ప్రారంభించారో వేలం నుంచి ఒక్కొక్కరే జారిపోయారు లాభం లేదని.

నేను చిన్నవాడ్ని గనుక నాయందు కనికరించి నాకే వదిలేస్తాడని చిన్నవాడు, నేను పెద్దవాణ్ని గనుక నన్ను గౌరవించి నాకే వదిలేస్తాడని పెద్దవాడు లోలోపల అనుకుంటూ పాటమట్టుకు తాపీగానే పెంచుతూ వచ్చారు. పాట పెంచుకోడంలో కలతలు రేగాయి. ముఖాలు కుమ్ములో కుక్కి తీసిన వంకాయల్లాగ కమిలిపోయాయి. ఒకరిపై మరొకరికి వుండే మంచి భావాలు మరుగుపడిపోయాయి. ఒకరిమీద ఒకరికి అసూయ, అసహ్యం పెరిగాయి. దాని పర్యవసానంగా ఆగ్రహము వీరిరువురిలో రూపందాల్చింది. నీ ముఖం మరి నేను చూడనని, నీ యిల్లు మరి నేను తొక్కనని, నీకూ నాకూ ఈ వాచీ మూలంగా ఆఖరు ఘడియలు వచ్చాయని, మనస్సు నొచ్చే అనేక పరుష వాక్యాలు అనుకున్నారు. దీనికంతటికి కారణం ఆ వాచీపైన యిరువురికి గల సమాన వ్యామోహం తప్ప మరేంలేదు. అన్న పాట 500 రూపాయలవరకు పెంచి యితరు లెవరికి అవకాశం లేకుండా చెయ్యాలని పట్టుబట్టాడు. అంతకుపైగా పాడడానికి యితరులకెవరికి అంగీకారం కూడా అయిందికాదు. 'ఆఖరుపాట నాది. 500 రూపాయలు' అంటూ వెళ్ళిపోబోతూవుంటే తమ్ముడు చెయ్యిపట్టుకొని 'తీసికో—ఇదినీదే' అనేసి మరి పాటపెంచకుండా వదిలేశాడు. ఈ ఒక్క వాచీ విషయంలోనే మనస్సులు చెడాయిగాని లేకపోతే అన్నదమ్ములకి ఉండవలసిన సహజ ప్రేమాభిమానాలు నూటికి నూరుపాళ్ళు యిద్దరిలోను ఉండకపోలేదు.

"ఇదిగో! వాచీ తీసుకో. నీ అడుగు జాడలలో మెసిలే రోజులు మరి నాకు లేవు. నీకు నాకు ఋణం తీరిపోయింది. నాహృదయం ఎంత కలవరపడి కలతచెందిందో నీ యిల్లు కూడా అంత క్షోభపడుతుందిలే" అని అంటూ మాధవరావు వెళ్ళిపోయాడు. ఆ ఘడియలగాయితు తండ్రియింట్లో యీ అన్నదమ్ముల ముఖాలు మరి కనిపించాయి కావు.

కొంతకాలానికి మాధవరావు ఒక బీద యింటి అమ్మాయిని వివాహం చేసుకొన్నాడు. కాని ఆ పెళ్ళికి అన్న అయిన కేశవరావును ఆహ్వానించలేదు. కేశవరావు అయినా మనస్సు మార్చుకొని పెళ్ళికి వెళ్ళలేదు. వివాహం జరిగిన మొదటి సంవత్సరములోనే ఏమి దురదృష్టమోగాని తమ్ముడిదగ్గర చిక్కని పాలు యిచ్చే చక్కని ఆవు చనిపోయింది. ఇంటికి ఉత్తరంవైపువున్న పాలలో తెల్లవారేసరికి అది చచ్చిపడివుంది. కారణం ఏమిటో ఎవరికి తెలియదు. ఇట్లాగే ఎన్నో నష్టాలు, కష్టాలు, ఒకటి తర్వాత ఒకటి తటస్థపడ్డాయి. వీటితో మరీ క్రుంగి కృశించిపోయాడు మాధవరావు అన్నిటికితోడు ఇది జరిగిన కొద్ది రోజులకే నడిశీతాకాలంలో అకారణంగా ఆవుకోసమని కొనివుంచిన గడ్డికుప్ప కాలిపోయింది. దీనంతటికి కారణం తనకు చెడురోజులు వచ్చాయని, ఎవరో దుర్మార్గులు తనకు కీడు తలపెట్టి యిట్లాంటి పనులు చేస్తున్నారని మాధవరావు భావించాడు. ఆ రాత్రంతా ఎంతో విలపించాడు. అసలే బీదవాడు. దానికితోడు పాడిపంట రెండుకూడా కంటిముందే నాశనమైపోవడం వల్ల మరీ ఫకీరు అయిపోయాడు. ఏ పని చెయ్యడానికి కూడా మనస్సు అంగీకరించకుండా పోయింది.

గడ్డికుప్ప కాలిపోయిన ఆ సాయంత్రం తమ్ముడింటికి అన్న వచ్చాడు. ఏదో ఆలోచిస్తూ పడుకున్న మాధవరావు అన్నరాక చూస్తూనే చివాలున లేచి యిట్లా అన్నాడు.

'ఇక్కడ నీకు ఏమిపనుంది?' అని కోపంగా చూచాడు, అన్నవైపు.

జవాబిచ్చేముందు కొంచెంసేపు కేశవరావు ఆగాడు. తర్వాత చాలా శాంతంగా తమ్ముడితో "నీవు చాలా కష్టదశలో వున్నావు. నీకు సహాయం చేద్దామని వచ్చాను" అన్నాడు.

"ఇప్పటికి నీవుచేసిన సహాయం చాలు. మరేం వద్దు. నేను ఏమైపోవాలని నీవు కోరావో అంతకంటె తక్కువ నేనేమీ కాలేదు. నీకోరిక నెరవేరిందిగదా! ఇక దయచెయ్యి యిక్కడనుంచి. నీవు యింకా నాముందు నిలబడితే నేను ఏమి చేస్తానో నాకే తెలియదు. నామనస్సు, యింద్రియాలు నా అధీనం తప్పిపోతాయి. నీముఖం చూపెట్టకుండా యిక్కడనుంచి తక్షణంవెళ్ళిపోవడం యిరువురికి మంచిది" అన్నాడు తమ్ముడు.

# ★ పేచీ తెచ్చిన వాచీ ★

"నీవు చాలా పొరపడుతున్నావు తమ్ముడూ! నామీద నీకుకలిగిన దురభిప్రాయానికి నేను చాలా విచారిస్తున్నాను" అన్నాడు అన్న.

"ముందు ఇక్కడనుంచి వెళ్లిపో. మనిద్దరికి సహాయపడేవాడు భగవంతుడే వున్నాడు. నన్ను రెచ్చగొట్టకుండా వెంటనే వెళ్ళిపోవడం నీకు మంచిది" అన్నాడుతమ్ముడు.

"వాచీ తనకు దక్కనీయకుండా నేను తీసుకున్నాననేకోపం, ఇంట్లోవున్న ఆవు చచ్చిపోవడం, గడ్డికుప్ప కాలిపోవడం, వీటన్నిటితో మనస్సు చెడి మథనపడుతు ఏవేవో అనరాని మాటలు అంటున్నాడు. ఆపరిస్థితిలో ఎవరైనా అట్లాగే వుంటారు. వాడంటున్న మాటలకు నేను కూడా కోపం తెచ్చుకొని వెళ్ళిపోతే వాడికి మరి దిక్కు ఎవ్వరూ లేరు. వాడు నన్ను అనకూడని మాటలు అంటున్నప్పటికి వాడు నాతమ్ముడే గదా! వాడి బాగు చూచి నేను ఓర్వలేక పోతున్నానని, తాను చెడిపోవడమే నేను వాంఛిస్తున్నానని దురభిప్రాయ పడుతున్నాడు. దాన్ని తొలగిస్తేగాని నాకు శాంతి వుండదు," అని అనుకుంటూ పైకి "ఆవాచీ కావాలిస్తే నీవు తీసుకోవచ్చు. నీకు యివ్వడానికి నాకు ఎటి అభ్యంతరము లేదు" అన్నాడు చాలా కనికరంగా కేశవరావు.

"వాచీ కోసం నేను ఏడ్వడం లేదు. నన్ను నీవు ఏమీ ఓదార్చనక్కరలేదు. నాచావు నన్ను చావనిసే అంతేచాలు, పో యిక్కడ నుండి" అని గట్టిగా అరిచాడు, పిచ్చివాడి లాగ. ఎంత శాంతపరచబోయినా కోపం రెట్టింపు కావడంచేత అన్నకు ఏమితోచిందిగాదు. నిస్సహతతో, నిర్విణ్ణుడై, నిస్పృహతో అట్లాగే నిలబడి పోయాడు గుమ్మంలో. కాని తమ్ముడే ఆ సమీపంనుంచి తొలగిపోయాడు చిరాకుతో. చేసేది ఏమీ లేక తర్వాత తానుకూడా వెళ్ళిపోయాడు అన్న. కాని తమ్ముడి యొక్క కష్టపరంపరలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే వున్నాయి. అనేక దఫాలు తమ్ముడికి తనపట్ల మంచి అభిప్రాయం కలగాలని, తమ్ముడి కష్టాలు అన్నీ తొలగి పోవాలని దేవాలయంలో ప్రార్థిస్తూ వుండేవాడు. ఏ రూపంగానైనా సహాయం చేద్దామని నిశ్చయించుకొని తీరా యింటికి వెళ్ళేసరికి యింట్లోనుంచి పైకి వచ్చేవారో, లోపలికి వెళ్ళేవారో, తమ్ముడితో మాట్లాడుతూవుండే వారో ఎవరో ఒకరు కనిపిస్తు వుండడంవల్ల అనుకున్న సహాయం కూడా చేయలేకపోతూ వుండేవాడు.

కాని ఒకసోమవారం చాలా ఆలస్యంగా దేవాలయానికి కేశవరావు వెళ్లాడు. అక్కడ తమ్ముడు అనుకోకుండా కనిపించాడు. జీర్ణవస్త్రాలు, వాడిన మోము, రేగిన జుత్తు, కృశించిన ఆశరీరము చూచేసరికి అన్నగుండె తరుక్కుపోయింది. గుడనిండా నీళ్లు గిర్రున తిరిగాయి. తనకు తన తమ్ముడికి చిన్నప్పుడు ఎంతప్రేమ, అభిమానం వుండేవో, ఎట్లా ఒకరినొకరు విడువకుండా సంచరిస్తూ వుండే వారో అవన్నీ స్మృతిపథానికి వచ్చాయి. 'అంతమంచివాడు యింత కఠినుడుగా ఎట్లా మారి పోయాడోగదా! ఆపాపిష్టివాచి ఎంత పనిచేసింది! మాయిద్దరి మధ్య మనస్పర్థలు రేకెత్తించి, మాలోమాకు ఆరని మంటలను ప్రజ్వరిల్ల చేయించి, అన్నదమ్ములముగ వుండడానికి వీలులేని పరిస్థితికి కారకుడైన మాతండ్రిని నేను దూషించాలో, భూషించాలో తెలియడంలేదు. సరే ఏమైనా అయింది. నేనే దగ్గరకు వెళ్ళి నా బాధను చెప్పుకుంటాను. నన్ను వాడు చిన్నతనంచేత దూషిస్తూ దూరంచేసినా, వాడిని దగ్గరకు చేర్చుకొని ఆదరించవలసిన బాధ్యత నాది. నన్ను కోపంచేత తిట్టినాసరే, కొట్టినాసరే, నేనేవెళ్ళి పలకరించి అంతా మరిచిపొమ్మని ప్రతిమాలుకుంటాను' అని మనస్సు కూడ బెట్టుకొని దగ్గరకు చేరబోయేవేళకు చుట్టూ ఎవరో వుంటూవుండడంవల్ల వీలుకాలేదు. తమ్ముడు తలఎత్తిచూస్తాడేమో పలకరిద్దామని ఆశించాడు. తమ్ముడి చెంత అతని భార్యకూడా వుంది. కాని ఆవిడతో తనకు పరిచయం బొత్తిగాలేదు. ఆకారణంచేత పోనీ యింటికేవెళ్ళి పలకరిద్దామని నిశ్చయించుకుంటూ తనయింటికి వెళ్ళిపోయాడు.

అనుకున్న ప్రకారం ఆమర్నాడు బయలుదేరి తిన్నగా తమ్ముడి యింటిగుమ్మందగ్గరకు వచ్చాడు. అక్కడ తన తమ్ముడిభార్య "మిమ్మల్ని కలుసుకోవాలని గాబోలు మీ అన్నగారు దేవాలయంలో ఉదయం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మీమీద ఆయనకు ఎంత మమకారమోగదా!" అని యింకేమేమిటో అంటున్నట్లు విన్నాడు.

"ఊహుం. వాడు నన్ను ఎప్పుడూ తలచడు. తలచడానికి మరి వీలు లేదు. నాకు బాగా తెలుసు. వాడికి నేను అవసరం లేదు" అంటున్నాడు తమ్ముడు.

చాలాసేపువరకు మరేమీ మాటలు వినిపించలేదు. చలివేస్తున్నా బైటే కొంచెం సేపు నిలబడ్డాడు. తమ్ముడి భార్య నిప్పుచేసి కుంపటిమీద నీళ్ళు మరిగిస్తోంది. ఆ నీళ్ళు మరుగుతున్న శబ్దంకూడా వినిపిస్తోంది. ఒక చంటిపిల్ల అప్పుడప్పుడు కీచుగొంతుకతో ఏడుస్తోంది. తమ్ముడు ఉయ్యాల లాగుతున్న ధ్వనికూడా వినిపిస్తోంది. మరి కొంతసేపటికి తమ్ముడి భార్య యిట్లా అన్నది:

"మీరు నాముందు ఒప్పుకోకపోయినా మీకుమాత్రం మీ అన్నగారిని కలుసుకొని మీ ఆవేదన చెప్పుకోవాలని లేదా? మీ యిద్దరికి కూడా అట్లాగే వుంటుందని నాకు తెలుసు."

"తెలుస్తే సరే. మరి ఆ మాటలు మానేసి యింకేమైనా చెప్పాలని వుంటే చెప్పు. ఆ ప్రసంగంమాత్రం ఎత్తకు," అన్నాడు. మరి కొంచెం సేపటికి లేచి పైకి వెళ్లిపోయాడు తమ్ముడు. తమ్ముడి రాక కనిపెట్టి అన్న పక్కనేవున్న కర్రలకొట్టులో దాక్కుబోయాడు. కాని తమ్ముడుకూడా అదే సమయంలో అక్కడికే వచ్చాడు కర్రలకోసమని గాబోలు! తమ్ముడికి కనిపిం


## అమృతసంజీవినీ మాత్రలు

గర్భిణులు ప్రసవించువరకు సేవించిన సుఖప్రసవము, ఆరోగ్యసంతానము కలుగును. వేవిళ్లు, నిస్త్రాణ, పాలిపోవుట నివారించి ఉత్సాహము, నరముల పటుత్వము కలుగజేయును. వెలకు రు 3.

## ఉదరాంతకి

చంటిబిడ్డల లివర్ స్ప్లీన్ వ్యాధులు సమస్త అనాసలు నివారించును. అజీర్ణము, కడుపుబ్బరము, ముక్కుచు విరేచనమగుట నివారించి, బలము, రక్తవృద్ధి కలిగించును. వెలకు రు 2

## బాలా జీర్ణవటి

3 సం॥లు దాటిన పిల్లలకు తరచు కలుగు అజీర్ణము, కడుపుబ్బరము, నీళ్ళ విరేచనములు తెల్లగా పాలిపోవుట, క్రమముగా కృశించుట హరించి రక్తవృద్ధి, బలము కలిగించును. వెలకు రు 1.

## శతమూలికాది లేహ్యము

ఇది సుఖ మేహ వ్యాధులు, ఎరుపు, తెలుపుమచ్చలు, బగ్గెలుమాన్పి రక్తము వృద్ధిపరచి బలము, నరముల పటుత్వము కలిగించును. స్త్రీలబుతుబాధలు, అమితనొప్పి నివారించి తప్పక సంతానము కలుగజేయును. లోహాభ్రకసింధూరముతో కు. 40 రు 18.

శ్రీ భుజంగరావైద్యశాల,
తాళ్ళరేవు, తూర్పుగోదావరి.

చకుండా ఒకమూల తలుపువెనుక పొంచి నిలబడ్డాడు. తమ్ముడు తాను మోయగలిగినన్ని కర్రలు తీసి భుజంమీద వేసుకోబోయి తూలిపోయాడు నిస్సత్తువచేత. తిరిగి లేస్తూ "నా శరీరస్థితి యింతవరకు వచ్చింది. ఎందుకు ఇంకా బ్రతికిస్తున్నావు భగవంతుడా?" అని అనుకుంటున్న మాటలు అన్న చెవిని బడ్డాయి. ఆ మాటల తాలూకు భావం పూర్తిగా అర్థం చేసుకోగల అన్న వెంటనే వెళ్ళి తమ్ముణ్ణి కౌగలించుకొని తన మనోవేదనను వెడల గ్రక్కుదామనుకున్నాడు. తమ్ముడికి కొత్తగా దగ్గు కూడా ఒకటి ఏర్పడింది. కొంతసేపు వరకు దగ్గుతూనే నిలబడ్డాడు గోడకు ఆనుకొని. తర్వాత మెల్లిగా కోలుకొని అన్నను గమనించకుండానే పక్కనుంచి వెళ్ళిపోయాడు. అన్న చాలాసేపు ఆచలిలో నిలబడ్డాడే గాని లోపలికి వెళ్ళి మాట్లాడ్డానికి ధైర్యంచాలింది కాదు.

"ఈ వాచీమూలంగానే గదా మా యిద్దరి మధ్య యీ కలత చెలరేగింది. దీనిని ఇక్కడ వదిలేస్తే మరే బాధవుండ"దనుకుంటూ తన తమ్ముడు టార్చిలైటు నిత్యం ఎక్కడ పెడుతూవుంటాడో ఆపక్కనే వాచి పెట్టేసి ఎంతో భారం వదిలిపోయినట్లు తలుస్తూ ఒక్క వూపున గబగబ యింటికి వెళ్ళిపోయాడు కేశవరావు.

మర్నాడు ఉదయం తాను వాచి వుంచిన స్థలానికి సమీపంలోనే వున్న కర్రల కొట్టు కాలిపోయినట్టు తెలిసింది. కారణం తెలుసుకోలేకపోయాడు. చీకటి పడ్డతర్వాత తిరిగి కేశవరావు బయలుదేరాడు. ఆకాశం వెన్నెల వెదజల్లుతోంది. తాను వాచివుంచిన ఆ కాలిపోయిన స్థలం సమీపించాడు. వాచీకి బదులుగా ఒక బంగారపు ముద్ద కనిపించింది. బంగారపు వాచి కరిగి యీ రూపం దాల్చిందిగదా అనుకుని ఆముద్ద పట్టుకొని వెళ్ళిపోయాడు.

అన్నదమ్ములిద్దరికీ బద్ధవిరోధం వున్నట్లు, తమ్ముడికి కలుగుతున్న బాధలన్నిటికీ అన్నే బాధ్యుడైనట్లు భావిస్తున్న యిరుగుపొరుగు వారంతా పోలీసు సేషనులో రిపోర్టుయిచ్చారు వాళ్ళకు రాజీ చేయించవలసిందంటూ. ఆ తర్వాత మరి నాలుగు రోజులకు కోర్టు నుంచి యిద్దరికీ సమన్లువచ్చాయి. మంచి దుస్తులు వేసుకుని కేశవరావు, చిరిగిపోయిన గుడ్డలుధరించి మాధవరావు యిద్దరు కోర్టుకు వెళ్ళారు. అక్కడే ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారేగాని మాట్లాడుకోలేదు. కోర్టువారు మాధవరావును పిలిచి, 'మీ అన్నగారిపైన మీకు ఎటువంటి అనుమానమైనా వుందా?' అని ప్రశ్నిస్తే లేదని జవాబిచ్చాడు. నిజంగా అనుమానంవుంటే ఆ కారణాలు తెలుసుకొని కేశవరావుకు శిక్షవిధించేవారే. ఇప్పుడు ఏంచెయ్యడానికి వీలులేక "మీ రిద్దరు సోదరులు అనే విషయం మరిచిపోకండి. ఒక్క తమ్ముడుగాని, ఒక్క అన్నగాని లేకపోయాడే నాకని విలపించే అన్నదమ్ములు ఎంతోమంది వున్నారు. ఆ దురదృష్టం మీకు పట్టనందుకు, ఏకోదరులుగా జన్మించినందుకు, సంతోషించండి. దీర్ఘకాలం పగసాధించే పట్టుదల యెంతమాత్రం కూడదు. మంచిని సాధించడానికి పట్టుదల అవసరం కాని, చెడు తలపెట్టడానికయినా పట్టుదల పనికిరాదు. ఇద్దరు కలిసి ఐకమత్యంగా వుండండి" అంటూ జడ్జీ బల్ల దిగి వెళ్ళిపోయాడు.

ఎవరిదారిని వారు—యీ అన్నదమ్ములు కూడా వెళ్ళిపోయారు తమ ఇళ్లకు. తర్వాత కొద్దిరోజులకే ఒకనాడు రాత్రి కేశవరావు యింటికి ఒక బీదస్త్రీ వచ్చి తనయింటికి ఒకదఫా రావలసిందిగా కోరింది. కేశవరావు ఆవిడను బాగా గుర్తించాడు. తన తమ్ముడి భార్య అని తెలుసుకున్నాడు. కాగావచ్చిన కారణం కూడా వెంటనే పోల్చుకున్నాడు. మారు చెప్పకుండా ఆవిడ వెనుక బయలుదేరి వెళ్ళాడు. దూరంనుంచే తమ్ముడి యింట్లోనుండి ఒకదీపం మినుకు మినుకుమంటూ కన్పిస్తోంది. ఆ వాతావరణం అంతా శూన్యముగా గోచరిస్తోంది. భరించ శక్యముగాని వేదన, మంట హృదయములో ప్రవేశించింది. ఈ మంట మరేరకపుమంటకు కారణం కాబోతుందో అని మనస్సులో పరిపరి విధాల చింతిస్తూ ఆ కుటీరం సమీపించాడు. ఇంటిముందు దుర్గంధం కొడుతోంది. ఆ వాసన భరించలేకపోతున్నాడు. అయినా వెళ్ళక తప్పదు గనుక తమ్ముడి భార్య ముందు నడుస్తూవుంటే తాను ఆ వెనుకే లోపల ప్రవేశించాడు. ఒక చంటిపిల్ల పొయ్యిదగ్గర కూర్చుని బొగ్గులు నములుతోంది. వళ్ళంతా మసి. చూడ్డానికి ఎంతో అసహ్యంగా వుంది. కాని ఆ నల్లని ముఖం నుండి తెల్లని పళ్ళు నవ్వు ప్రదర్శిస్తున్నాయి. ఆ అమాయకపు పిల్లకు యిదంతా ఏం తెలుసుంది!

పుక్కినులకమంచంమీద, అన్నిరకాల చిరిగిన చెత్తగుడ్డలమధ్య మాధవరావు వెల్లకిలా పడుకునివున్నాడు. శరీరం పూర్తిగా కృశించిపోయింది. కళ్ళులోపలికి పోయాయి. ఎముకలుతప్ప మరేం కనిపించడం లేదు. అన్నరాక చూస్తూనే లేవబోయాడు కాని తిరిగిమంచంమీదే పడిపోయాడు. తమ్ముడి ఆ పరిస్థితి చూడగానే కేశవరావుకు పట్టలేని దుఃఖం వచ్చింది. అప్రయత్నంగా చెక్కిళ్ళ మీంచి నీళ్ళుబొట్లురాలాయి. మంచంచివర కూర్చుని, ఆపుకోజాలని ఆవేదనలో ఏమీ కూడా మాట్లాడలేక కొన్నినిముషాలువుండి పోయాడు. తమ్ముడు అన్నవైపు రెప్పవేయకుండా, దైన్యంగా చూస్తూ భార్యను అవతలికి పొమ్మన్నాడు బహుశా అన్నతో ఆఖరి మాటలుగా ఏవో చెప్పాలని గాబోలు! కాని ఆవిడ వెళ్ళిపోవడానికి కేశవరావు అంగీకరించాడుగాదు.

ఇద్దరు అన్నదమ్ములు వాచీ వేలం అయిన రోజు లగాయితు ఆక్షణం వరకు జరిగిన విషయాలు, ఇద్దరూ పొందుతున్న వేదన, అన్నీ చెప్పుకున్నారు. వాచీ తన వద్దకు చేరినది లగాయతు, చివరకు కరిగి ముద్దయిపోయే ఘడియ వరకు తన ప్రాణానికి హాయిలేకపోయిందని అన్న అంటూ ఆ బంగారపు ముద్ద చూపెట్టి తమ్ముడిపక్కలో వుంచేశాడు. అది చూచి తమ్ముడు సంతోషించలేదుసరిగదా ముట్టనైనా ముటలేదు. అన్ని ఆశలు అంతరించాయి. 'ఆఖరు గడియలు సమీపించాయి' అని అంటున్న తమ్ముణ్ణి వదిలి వెళ్ళలేక దగిరేవుండి చేయదగ్గ సహాయం, సపర్యలు చేస్తూ వచ్చాడు.

మరునాడు ఉదయం లేస్తూనే అన్నతో "నాకు మరేం భయంలేదు. నన్ను గూర్చి ఎవరూ బెంగపడవద్దు. నా వంట్లో యిప్పుడు చాలాబాగుంది. ఈ క్షణం లగాయితు మనమిద్దరం తండ్రి బ్రతికివున్నప్పుడు ఎట్లాకలిసిమెలసి అన్యోన్యంగా ప్రేమతో వుండేవాళ్ళమో అట్లాగేవుందాము. నన్ను విడిచి వెళ్లకు. నిన్ను విడిచి నేనువుండలేను. నాకుటుంబం నీకుటుంబంతో కలిసిపోవాలి. ఇద్దరం కలిసేవుందాం" అన్నాడు. అంతే. అవేఆఖరుమాటలు. అవే ఆఖరు చూపులు. అదే ఆఖరు కలయిక. అంతే. మరి తమ్ముడు లేడు యీ ప్రపంచములో.

కేశవరావు తమ్ముడుకుటుంబాన్ని తాను చేరదియక తప్పిందిగాదు. అసూయ, ఈర్ష్య వల్ల తనతమ్ముడికి తనకు కలిగిన శారీరక, మానసిక పరిణామాలు అనుక్షణం మననంచేస్తూ, ఉపాధ్యాయుడుగా తనశిష్యులను ఇటువంటి యీర్ష్య, అసూయలనుండి దూరంగావుండమని, ప్రేమలేనిజీవనం వృథాఅని, సోదర ప్రేమ అమోఘమైనదని బోధిస్తూ, తమ్ముడి కుటుంబాన్ని ఆదరిస్తూ, తమ్ముణ్ణి స్మరిస్తూ జీవితం గడిపాడు. ★

శ్రీ కాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30